

# ఆ పాత పాట మధురం

## రాజా



నెలనెలా..ఒక పాత సినిమాలోని పాటల సంగీత సాహిత్య విశ్లేషణ

# చండీరాణి

*'మ్యూజిక్' అనే ఆంగ్ల పదానికుండే స్పెల్లింగ్‌లోని 'ఎమ్ - యు - యస్ - ఐ - సి' లో 'ఎమ్' అంటే మెలోడీ అని, అది గనుక మిస్సయితే 'యు బికం సిక్' అనీ కొందరంటారు సరదాగా! అదొక చమత్కారంగా తీసుకున్నా సరే నిజంగా అదే నిజం!! కొన్ని కొన్ని అనుభవం మీదనే తెలిసొస్తాయని, ఈ మాట కూడా ఆ కోవలోనిదేనని అనుభవం మీదనే ఒప్పుకుంటారు కూడా!! అటువంటి అనుభవం మీద అర్థమయ్యే మెలోడీకి పెద్ద పీట వేసిన చిత్రాలలో భరణీవారి 'చండీరాణి' కూడా ఒకటి.*

ఈ చిత్రానికి కథ, *దర్శకత్వం: భానుమతి, నిర్మాణం, కూర్పు: పి. రామకృష్ణ, మాటలు, పాటలు:సముద్రాల, సంగీతం: కీ.శే.సుబ్బరామన్, విశ్వనాథ్ ఈ చిత్రంలో గల ఎనిమిది పాటలలో మూడు పాటల గురించి.*

ఈ వయార మీ విలాస మోహో - రాజరాజా నీదేరా ||ఈ వయార ||

నీటూ గోటూలా తరితీపి మాటలా ||నీటుగోటు||

సయ్యాటలోన సాటిలేని

జాణనోయి రాజా - ఏలరా ||సయ్యాట|| ||ఈ వయార ||

ఓ వెన్నెల రేడా - ఓ - ఓ నా వన్నెల రేడా - ఓ - ఓ

వయసూ మనసూ వలపూ వగలూ కనరా - కొనరా రాజా ||వన్నెల రేడా||

ఈ పాటను ఎ.పి కోమల పాడగా, రీటా అభినయించింది. హిందూస్థానీ సంప్రదాయంలో మారూబేహాగ్ అనే రాగం ఒకటుంది. వసంత్ దేశాయ్ సంగీతాన్ని ఇచ్చిన 'గూంజ్ ఉఠీ శహనాయీ' సినిమాలో 'తేరే సుర్ ఔర్ మేరే గీత్' పాట దానికి మంచి ఉదాహరణ. మన

'చెంచులక్ష్మి' సినిమాలో 'నీల గగన ఘనశ్యామా' అనే పాటను కూడా చెప్పుకోవచ్చు. ఇవి కేవలం ఆ రాగం ఇలా ఉంటుందని తెలుసుకోడానికి మాత్రమే. ఆ రాగంలో కొంత భాగాన్ని, యమన్ రాగంతో కలుపుతూ 'ఈ వయార మీ విలాసమోహో రాజ రాజా' పాటని స్వరపరిచినట్టు అనిపిస్తుంది. అది కూడా మొదటి చరణం వరకే!

ఈ పాట దొరికితే విని చూడండి. 'ఈ వయార మీ విలాస మోహో' అని వింటున్నప్పుడు ఒక విలాసిని వగలొలికించే విధంగా నడుస్తూ వస్తున్నట్టు అనిపిస్తుంది. దృశ్యానుభూతి కలిగేలా స్వరకల్పన చేయగల ప్రతిభకు తార్కాణంగా ఈ పాటను ఉదహరించవచ్చు.

---

కలిసే కన్నులా - తొలి వలపే తూలే ||కిలా కిలా ||
మిల మిల తారకలా - అందాలూ చూడ
జాబిలి మబ్బులలో - దోబూచులాడె
బెదిరీ నా మనసూ ఉయ్యాల లూగె ||బెదిరీ ||
నా వలపే సోలి - చేజారిపోయే ||కిలా కిలా ||
పనులూరేలెప్పుడూ - నీ స్మరణే ఆయే
గాలి మేడలలో - కాపురమైపోయే
మనసూ నీ చెలిమీ - మరువాలేదాయే ||మనసూ ||
నా కథయే - వింతగాథై పోయే కిలా కిలా

ఈ పాటకు ఆలాపన, అభినయం భానుమతే! ఈ పాటను ఆలపిస్తున్న కొద్దీ ఇందులోని డెప్త్‌ని ఆస్వాదించగలుగుతాం. అందుకు కారణం ఆధార రాగమైన దర్బారీకానడ! ఆ రాగాన్ని ఎంత ఆలపిస్తూ ఉంటే గుండె అంత బరువవుతూ ఉంటుంది. కావాలంటే 'బైజూ బావ్ రా'లో 'ఓ దునియాకే రఖ్‌వాలే' పాటని ఆలపించుకుంటూ అదే మూడ్‌లో ఉండండి - తెలుస్తుంది. కొంతమంది ఈ 'కిల కిలా నవ్వులా' పాటలో 'కురిసే లేవెన్నెలా' అనే లైనుని 'వెన్నెల కురిసిందిలే' అనే అర్థం వచ్చేట్టు 'కురిసేలే - వెన్నెలా' అని పాడతారు. 'లేవెన్నెల' అంటే లేత వెన్నెల.... అంచేత ఈ అర్థంలో పాడాలి. ఈ పాట కొంత కష్టపడితే బైట దొరుకుతుంది. సంపాదించి వినండి. భానుమతి ఒకవైపు ఆ అర్థం వచ్చేట్టుగాను, మరో వైపు బ్రీతింగ్ స్పేస్‌కు వీలు కలిగేట్టుగాను ఎలా పాడిందో తెలుస్తుంది.

---

అ: ఓ - తారకా ఓ
ఆ: ఓ - జాబిలి ఓ
అ: ఓ తారకా నవ్వులేలా నను గనీ
ఆ: అందాలు చిందెడి - చందమామ నీవనీ
ఓ - జాబిలీ - ఓ - ఆతారకా నవ్వునోయీనినుగనీ
అ: వినువీధిలోని - తారాకుమారీ
కుమారీ దరి చేరనౌనా - ఈ చందమామా
ఆ: చేరువే తారా రేరాజుకూ
ఓ... తారక నవ్వునోయీ నినూగని -
అ: మనోగాథ నీతో నివేదించలేనూ -
నివేదించకున్నా జీవించలేనూ
ఆ: నెరజాణవేలే - ఓ జాబిలీ
ఓ.. ఆ తారకా నవ్వునోయీ నినూ గనీ
అ: తొలిచూపులోనీ - సంకేతమేమో -
చెలి నవ్వులోని ఆ శిల్పమేమో
ఆ: నీ నవ్వువెన్నెలే - ఓ జాబిలీ
ఓ...ఆ తారకా నవ్వునోయీ నినూగని

మిశ్రయమన్ రాగ ఛ్చాయలలో స్వరపరచబడిన ఈ పాటలో హవాయిన్ గిటార్ వాద్యం అడుగడుగునా మాధుర్యాన్ని వినిపిస్తూ ఉంటుంది. పాట మొదట్లో వచ్చే సాకీలో గల 'నవ్వులేలా' అనే పదం వద్ద మంద్రస్థాయిలో వినిపించిన ఘంటసాల గళ పరిమళాన్ని

జ్ఞాపకాల దొంతర్లతో అనుభూతి పరంగా ఆవహింప చేసుకోగలిగితే శరీరం రోమాంచితం అయిపోతుంది. మెజాయిక్ ఫ్లోర్ మీద మంచుగడ్డలా, పట్టుదారం పై మంచి ముత్యంలా జాలువారే గమకాలతో ఎప్పుడూ విలక్షణంగా భాసించే భానుమతి స్వరమాధుర్యం - ఈ పాటలో అంత దగ్గరి గమకాలు లేకపోయినా - సుస్వరానికి పరవశించగల ప్రతి హృదయాన్నీ పులకరింప జేస్తుంది. రచనలోనూ, స్వరరచనలోనూ పవిత్రత తొణికిసలాడే ఈ పాటకి ముగింపులో వచ్చే మ్యూజిక్ - ఆ తర్వాత ఇంకో చరణం ఉందేమో - అందుకు ఇది ఇంటర్లూడేమో అనే భావన కలిగించి అతి ఆశ్చర్యకరంగా ముగుస్తుంది. ఈ పాటను ఎన్.టి.ఆర్., భానుమతి అభినయించారు.

---

ఒకవైపు ద్విపాత్రాభినయాన్ని, మరో వైపు దర్శకత్వాన్ని ఏక కాలంలో చేయడమనే ప్రక్రియను ఓ సాహసంగా, ఓ రికార్డుగా భావిస్తున్న ఈ తరం వారికి - ఇవన్నీ 'చండీరాణి' చిత్రంలో ... ఆనాడే.. అంటే 1953లోనే భానుమతి చేశారని, అదీ మూడూ భాషలలో చేశారని తెలిస్తే ఆనాటి కళాకారులను గొప్పవారుగా ఈ నాటికీ ఎందుకు చెప్పుకుంటున్నారో కొంత అర్థమయ్యే అవకాశం ఉంది.

ఈ చిత్రానికి సంగీతం: సి.ఆర్.సుబ్బరామన్ - విశ్వనాథ్ అని టైటిల్స్‌లో వేశారు. నిజానికి 'చండీరాణి' ముహూర్తంతో మొదలైన తర్వాత సి.ఆర్.సుబ్బరామన్ మరణించారు. ఆయనకు అసిస్టెంట్‌గా పనిచేసిన విశ్వనాథ్ ఈ చిత్రాన్ని పూర్తిచేశారు. మొత్తం స్వరరచనా బాధ్యతనంతటినీ తానే అయి స్వీకరించినా "ఇది గురువుగారి సినిమా... ఆయన పేరు వేయడమే ధర్మం. అందుకని ముందు ఆయన పేరే వేయండి" అంటూ పట్టుబట్టి మరీ ఆయన పేరుని వేయించారు విశ్వనాథ్. ఈరోజుల్లో అంతటి నైతిక విలువలను చూడగలమా!?

ఆ విశ్వనాథ్ ఎవరో గాదు... తర్వాత రోజుల్లో తన సంగీత ఝురితో దక్షిణ భారతదేశాన్ని ఓ ఊపు ఊపేసి ఇళయరాజా వంటి సంగీత దర్శకులకు ఆరాధ్య దైవంగా గౌరవాలనందుకున్న - ఎమ్.ఎస్. విశ్వనాథనే!!...

---

ఆ నాటినుంచీ ఈ నాటి వరకూ వచ్చిన, వస్తున్న సినిమాల్లోని పాటల సాహిత్యం గురించీ, సంగీతం గురించీ సాధికారకంగా, సవివరంగా, సరళంగా, సమగ్రంగా విశ్లేషించగల ఒకే ఒక్క సీనియర్ మోస్ట్ జర్నలిస్ట్ రాజా. 'కౌముది' పాఠకులకోసం ఆయన వ్యాసాలని నెలకొకటి అందిస్తున్నాం. ఒక్కసారి నిన్నటి తరం పాటల్ని నెమరు వేసుకుందాం.. ఆ నాటి మధుర స్వరాలని మరోసారి గుర్తు తెచ్చుకుందాం.

రాజా గారి ఇ-మెయిల్ ఎడ్రసు: **raja_musicologist@rediffmail.com**